క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన రెడ్డి సంఘం సభ్యులు



శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని గ్రామరెడ్డి సంఘం సభ్యులు మంగళవారం భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, నాయకులు మామిడి అశోక్, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవసభకు తరలిన బీజేపీ శ్రేణులు



ఆత్మకూరు: హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ ఓబీసీ ఆత్మగౌరవ సభకు మండల కేంద్రం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, నాయకులు శ్రావణ్‌కుమార్, గట్టు వేణు, ఎంపీటీసీ బయ్య రమ తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

తాగునీటిని సరఫరా చేయాలి

హసన్‌పర్తి: గ్రామాల్లో నిరంతరంగా తాగునీటి సరఫరా చేయాలని ఈఈ రామాంజనేయులు సూచించారు. మండలంలోని సీతంపేట, గంటూరుపల్లి, పెంబర్తి గ్రామాల్లో నీటి సరఫరా తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో అక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

వీల్ అలైన్మెంట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నయీంనగర్ : వరంగల్, హనుమకొండ జిల్లాల వీల్ అలైన్మెంట్ అసోసియేషన్ షాప్ యజమానుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తండా చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా శశికళాధర్, కోశాధికారిగా భూపతిరెడ్డి, బాధ్యులుగా అఖిల్, అన్వర్, సంపత్, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ప్రవీణ్, అనిల్, బషీర్, సాజిద్, నరసింహా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రేట్లు తగ్గించుకోకుండా తీసుకోవాలని, నెలకు రూ.2 వేలతో చిట్టీ ప్రారంభించాలని, సభ్యులను ఆర్థికంగా ఆదుకోవాలని ఈ సందర్భంగా తీర్మానించారు.

లక్ష్మీనారాయణకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగంలో పరిశోధకుడు ఆడెపు లక్ష్మీనారాయణకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. గల్ఫ్ మైగ్రేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ రూ రల్ ఎకనామి ది కేస్ ఆఫ్ తెలంగాణ రీజియన్ అంశంపై సమర్పించిన పరిశోధనా త్మక సిద్ధాంత గ్రంథానికి లక్ష్మీనారాయణకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. ఎకనామిక్స్ విభాగం ఆచార్యులు బి.సురేష్ లాల్ పర్యవేక్షణలో లక్ష్మీనారాయణ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. లక్ష్మీనారాయణను హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎం.ఐలేష్‌తో పాటు పలువురి అభినందించారు.

విద్యతో పాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలి



హసన్‌పర్తి : విద్యతో పాటు చక్కటి సంస్కారాన్ని అలవర్చుకోవాలని సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'సంస్కార వికాస శిక్షణ' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ సాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం బోధనలు అనుసరించి ఎదగాలని సూచించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కజాంపురం దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించడం అలవర్చుకున్నట్లయితే ఉన్నతంగా ఎదుగుతారన్నారు.

బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఎంహెచ్‌ఆర్ఎం విభాగం ఆచార్యులు పి.శ్రీనివాస్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సెక్రటరీగా బాధ్యతలను నిర్వర్తించిన డాక్టర్ సవితాజ్యోత్స్న నుంచి శ్రీనివాస్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ యూనివర్సిటీలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు 'సాక్షి' స్పెల్‌బీ దోహదం



కమలాపూర్ : స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్ష రాస్తున్న ఎంజేపీ విద్యార్థినులు

కమలాపూర్: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని ఎంజేపీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రఫుల్లాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం సాక్షి ఆధ్వర్యంలో స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలు నిర్వహించగా 27 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికి తీసేందుకు సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇంగ్లీష్, మ్యాథ్స్‌లో ప్రావీణ్యం సాధించడం ద్వారా విద్యార్థులకు భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడుతాయన్నారు. విద్యార్థులు తమ టాలెంట్‌ను చూపించేందుకు ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తుంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులకు చదువుపై మక్కువ పెంచేందుకు కొన్నేళ్లుగా సాక్షి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనులు పాల్గొన్నారు. కాగా స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఉపాధ్యాయురాళ్లు ప్రోత్సహించారు



స్పెల్‌బీ పరీక్ష రాయడం ఇదే మొదటి సారి. ఇలాంటి పరీక్షలు రాయడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని ఉపాధ్యాయురాళ్లు ప్రోత్సహించారు. ఈ పరీక్షలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఎంతగానో దోహదపడుతాయి. స్పెల్‌బీ నిర్వహించిన సాక్షికి కృతజ్ఞతలు.

సీహెచ్.కీర్తన, 10వ తరగతి

టఫ్ అనిపించినా ఇంట్రెస్టింగ్‌గా ఉంది



మ్యాథ్స్‌బీ కాంపిటీషన్ కాస్త టఫ్ అనిపించినా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఇలాంటి కాంపిటీషన్ పరీక్షలు మా పాఠశాలలో ఇప్పటి వరకు జరుగలేదు. మాలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి, భయాన్ని పోగొట్టేందుకు కాంపిటీషన్ పరీక్షలు చాలా అవసరం.

టి.వంశిక, 7వ తరగతి

ఇలాంటి పోటీ పరీక్షలు మరిన్ని నిర్వహించాలి



స్పెల్‌బీ, మ్యాథ్‌బీ పోటీ పరీక్షలు మరిన్ని నిర్వహించాలి. సాక్షి నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా పోటీ పరీక్షలంటే భయం తొలిగిపోయింది. పోటీ పరీక్షలు రాయడం ద్వారా మాలో ఆత్మవిశ్వాసంతో పాటు ఇంప్రూవ్‌మెంట్ ఎంతగానో పెరిగింది.

వర్షిత, 10వ తరగతి

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



వేలేరు : కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు



నడికూడ : బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండల సమన్వయ కర్త మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, పీచర గ్రామశాఖ అధ్యక్షుడు పోలు తిరుపతి, మండల యూత్ ప్రధాన కార్యదర్శి హరీఫ్, సీనియర్ నాయకులు కొలిపాక వెంకటేశ్, మారబోయిన నాగరాజు, సట్ల రవీందర్, మంతపురి శ్రీనివాస్, నీలం శ్రీకాంత్ తదితరులు చేరినవారిలో ఉన్నారు.

నడికూడలో..

నడికూడ: మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని అప్పయ్యపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మడతలపాటి వీరన్న, బొంతల శ్రీనివాస్, కమలాపురం రామరావుతో పాటు మరికొంత మందికి సత్యనారాయణరావు కండువా కప్పి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవి, రవీందర్, కృష్ణమూర్తి, శంకర్, కట్టయ్య, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరామర్శ

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిటైర్డ్ స్వీపర్ హుస్సేన్ మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా హుస్సేన్ మృతదేహాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, బొమ్మినేని శ్రీనివాసరెడ్డి, జంగా రాజిరెడ్డి, నాగరబోయిన మోహన్, గుడిపెల్లి ధర్మారెడ్డి, నల్లా శ్యాంసుందర్ రెడ్డి, గుడిపెల్లి జనార్దన్‌రెడ్డి, గోవిందు రవీందర్, గుండెబోయిన ఖాజీ, ములుక నర్సింహారాములు, బోళ్ల వంశీ పాల్గొన్నారు.

నియామకం



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన సీపీఐ నాయకురాలు సిలువేరు విజయ భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ సమితి సభ్యురాలిగా నియామకం అయ్యారు. విజయ ప్రస్తుతం సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నల్లబెల్లి : దుగ్గొండి మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు బరిగెల రాంచంద్రు(52) నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన కాంక్రీట్ మిల్లర్ కొత్తగట్టు గణేష్ వద్ద 15 ఏళ్లుగా పని చేస్తున్నాడు. కాగా శుక్రవారం శనిగరంలో స్లాబ్ పనులు ముగించుకొని తోటి కార్మికులతో కలిసి బోలేరో వాహనంలో తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ కొత్తగట్టు శివ వాహనాన్ని నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడంతో నల్లబెల్లి మండల కేంద్రంలోని సామల దేవేందర్ ఇంటి సమీపం మలుపు వద్ద వాహనం నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కూలీలు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య వనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై వివరించారు.

పల్లెబాట పట్టిన అభ్యర్థులు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బరిలో నిలిచిన అభ్యర్థులు పల్లె బాట పట్టారు. ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్‌లో బీజేపీ అభ్యర్థి కాళీప్రసాద్‌రావు మంగళవారం ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. అలాగే ఆత్మకూరులో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల అధ్యక్షుడు పెండ్యాల భిక్షపతి దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అమలు చేసిన పథకాలను వివరించి, బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని గెలిపించాలని కోరారు. శాయంపేట మండలంలోని మైలారం, పత్తిపాక, గ్రామాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని గెలపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావుకు ఒక్కసారి అవకాశం కల్పించాలని ఆయన కుమార్తె అనుష కొప్పుల గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అదే విధంగా ధర్మసాగర్ మండలంలోని సోమదేవరపల్లి, దేవునూర్, రాపాకపల్లి, ధర్మసాగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని గెలిపించాలని కోరారు. పరకాలకు సేవ చేసే అవకాశం కల్పించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాళీప్రసాద్‌రావు ప్రజలను కోరారు. పట్టణంలో ఆయన ఓట్లను అభ్యర్థించారు. అలాగే పరకాల మండలం హైబోతుపల్లిలో పరకాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ రామన్



హన్మకొండ : సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి



కాజీపేట అర్బన్ : మాట్లాడుతున్న పురుషోత్తం

హన్మకొండ: ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ రామన్ అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ హనుమాన్‌నగర్–1లో భారతరత్న, నోబెల్ అవార్డు గ్రహీత సీవీ రామన్ 123వ జయంతిని జరుపుకున్నారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీవీ రామన్ అనేక పరిశోధనలు చేశారన్నారు. కార్యక్రమంలో మొట్ల మనోహర్, కుమార్‌రెడ్డి, సిరిమల్లె ప్రవీణ్, చిర్ర శ్రవణ్, శ్రీనివాస్, రాజ్ కుమార్, వెంకటేష్, రవికిరణ్, వినోద్, దేవేందర్, రాజేశ్, సురేష్ పాల్గొన్నారు.

సీవీ రామన్ స్ఫూర్తితో రాణించాలి

కాజీపేట అర్బన్ : సీవీ.రామన్ స్ఫూర్తితో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా రాణించాలని జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు కె.పురుషోత్తం అన్నారు. మండలంలోని కడిపికొండ జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం నిర్వహించిన సీవీరామన్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పురుషోత్తం హాజరై సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్, రాజగోపాల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో బీజేపీ విఫలం

నర్సంపేట : దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడిచిన వ్యవసాయ కార్మికులు, దళితులు, పేదలు, కార్మికులు, నిరుద్యోగ, విద్య, వైద్యం వంటి అనేక సమస్యలు పరిష్కరించలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య అన్నారు. ఈమేరకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అనంతగిరి రవి అధ్యక్షతన మంగళవారం పట్టణ కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అనుకూల శక్తులను ఓడించాలని వామపక్ష ప్రజాతంత్ర లౌక శక్తులను బలపర్చడానికి సీపీఎం నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, బ్యాంకింగ్, బీఎస్ఎన్ఎల్, విమానయాన, రైల్వేలు, బొగ్గు ఉత్పత్తి సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మతకలహాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. దేశంలో, రాష్ట్రంలో పార్లమెంటు, అసెంబ్లీలో కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గిన తర్వాత ప్రజల హక్కులు ప్రజాతంత్ర వాదుల వాదనలకు సంబంధించిన అనేక సమస్యల పరిష్కారానికి ఆస్కారం లేకుండా పోయిందన్నారు.

బీసీ గర్జనకు తరలిన బీజేపీ కార్యకర్తలు

కాజీపేట: మండల కేంద్రం నుంచి పీఎం నరేంద్ర మోదీ బీసీ గర్జన మహాసభకు బీజేపీ కార్యకర్తలు మంగళవారం భారీగా తరలివెళ్లారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. దాదాపు వంద మంది కార్యకర్తలు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి రావు పద్మతో కలిసి సభకు తరలివెళ్లారు.

కేయూలో మరో కొండచిలువ..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సోమవారం రాత్రి ఫార్మసీ హాస్టల్ సమీపంలో మరో కొండచిలువ సంచరిస్తుండగా పలువురు విద్యార్థులు చూశారు. క్యాంపస్‌లోని వివిధ విభాగాల సమీపంలోని చెట్ల పొదల్లో కూడా పలు కొండచిలువలు సంచరిస్తున్నాయి. దీంతో రాత్రివేళ వివిధ చోట్లకు సంచరిస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల – జీయాలజీ విభాగం మధ్యలో, శిథిలావస్థకు చేరి మూతపడిన ప్రతాపరుద్ర హాస్టల్ పరిసర ప్రాంతాల్లో కొండచిలువలు సంచరిస్తున్నాయని సమాచారం.

విద్యార్థులు కళారంగంలో రాణించాలి

చెన్నారావుపేట : విద్యార్థులు కళారంగంలో రాణించాలని కాంప్లెక్స్ హెచ్ఎం మానుపాటి పాపమ్మ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం కళా ఉత్సవ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సంగీతం, జానపదం, వాయిద్య సంగీతం, నృత్యాలు, విజువల్ ఆర్ట్స్, శాస్త్రీయ నృత్యాలు, ఇండిజీనస్ గేమ్స్, నాటికల పోటీలు నిర్వహించామన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన కళాకారులు ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించినపుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, పాపయ్యపేట కాంప్లెక్స్ హెచ్ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు రవి, సంతోష్‌కుమార్, రవీందర్, సరితా, శైలజా, తేజస్విని, మాధవి, వెంకటేశ్వర్లు, సృజన, దేవిక పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై ఫిలిప్‌రాజ్

ధర్మసాగర్: మండలంలోని అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్సై ఫిలిప్‌రాజ్ అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో మంగళవారం జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళా బృందం చదువు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్య వివాహాలు, బాలకార్మికులు, సీసీ కెమెరాలు వినియోగంపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. గుట్కా, గంజాయి, డ్రగ్స్ వలన జరిగే అనర్థాలను వివరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, రాబోవు ఎన్నికల్లో గొడవలు సృష్టించి కేసుల పాలై భవిష్యత్‌ను నశానం చేసుకోవద్దని సూచించారు. తదితర సామాజిక అంశాలపై పాటల ద్వారా, సైబర్ క్రైమ్ నాటిక ద్వారా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై పోచయ్య, సర్పంచ్ ఆకారపు అన్నమ్మ, కళాబృందం సభ్యులు నాగమణి, విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, చిరంజీవి, విక్రంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల తిరుగుబాటుతో కేసీఆర్‌కు వణుకు

- కేయూ జేఏసీ నాయకుడు దార సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుద్యోగుల తిరుగుబాటుతో సీఎం కేసీఆర్‌కు వణుకు మొదలైందని, ఈ ఎన్నికల్లో ఓటమిపాలవ్వడం ఖాయమని కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకుడు దార సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం ఏబీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగుల పవన్‌కల్యాణ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన విద్యార్థులకు కల్వకుంట్ల కుటుంబం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. చదువుకునే విద్యార్థులను ఉద్యోగాల ఆశ చూపి ఉద్యమాల బాట పట్టించిన కేసీఆర్.. తాను కుర్చీ ఎక్కిన తరువాత విద్యార్థులను గాలికొదిలేశారని మండిపడ్డారు. ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి ఇప్పటివరకు పరీక్షలు నిర్వహించకపోవడంతో కోచింగ్ తీసుకున్న యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేశారని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోసారి ప్రజలను మోసం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు వస్తున్నారని, ప్రజలు నమ్మొద్దన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ప్రస్తుతం కేసీఆర్ గుప్పిట్లో బందీ అయిన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు గ్రామస్థాయి నుంచి తమ పోరాటం మొదలు పెడుతామని స్పష్టం చేశారు. అతిత్వరలో బస్సు యాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. నాయకులు అశోక్, నవీన్, సల్మాన్, రజినియాదవ్ పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



మాదిగల విశ్వరూప సభ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కమలాపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించతలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గుండారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం విశ్వరూప మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల మాదిగ బిడ్డలు, అన్ని సంఘాల నాయకులు, కార్యకర్తలు విశ్వరూప మహాసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన వర్గీకరణ హామీ నేటి వరకూ నెరవేర్చలేదని, బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టే వరకూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు సంపత్, మాజీ ఎంపీటీసీ రమేష్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సాంబయ్య, వినోద్‌కుమార్, కుమార్, రాజు, రామస్వామి, చిరంజీవి, రవి, రాజేష్ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి చాలా గొప్పది



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి

ధర్మసాగర్: భారతీయులంతా భిన్నత్వంలో ఏకత్వం అనే విశిష్టమైన గొప్ప భారతీయ సంస్కృతిలో జీవిస్తున్నామని, నిట్ విశ్రాంత ఆచార్యుడు ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ శాస్త్రీయ దృకృథ ప్రచార ఉద్యమ కార్యక్రమ ప్రారంభంలో భాగంగా 'ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న' వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విజయం సాధించాలంటే శాస్త్రీయ నైపుణ్యాభివృద్ధి జరగాలన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆశయాలను విశ్రాంత ఉద్యానవన అధికారి ఉమామహేశ్వర్ వివరించారు. ప్రాచీన భారతీయ శాస్త్ర సాంకేతిక విజయాలు మనకున్నప్పటికీ ప్రపంచ దేశాలతో పోటీపడి ముందుకెళ్లాలంటే మానవీయ, ప్రకృతి వనరులను వినియోగించుకోవాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మప్రకాష్ విద్యార్థులకు సూచించారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. హెచ్ఎం మురళి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అవినీతి పాలకులను గద్దె దించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్‌చందర్‌రెడ్డి



మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

దామెర: రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి పాలకులను ఈ ఎన్నికల్లోఓడించి గద్దె దించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి ప్రజలను కోరారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మళ్లీ మాయమాటలతో ఓట్లు అడగడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగులు, ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నాయకులు వీసం రమణారెడ్డి, వేల్పుల రాజ్‌కుమార్, గన్ను సతీష్, పెంచాల జగన్, వాజ్‌పేయి, పెరుక సత్యం, సూర చందర్, మాదారపు రతన్ కుమార్, రమణారెడ్డి, మేరుగు శ్రీను పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన శ్రేణులు

హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ బీసీ ఆత్మగౌరవ సభకు మండలంలోని బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. ఉదయం మండల కేంద్రం నుంచి బయలుదేరిన బస్సును ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. దీంతో కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా తరిశారు.